ఎన్నికలు ముగిసే వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయకృష్ణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ మార్చి ఎనిమిదవ తేదీతో ముగుస్తుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని తెలిపారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కలెక్టర్ కార్యాలయం, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిలిపివేస్తున్నామని, దీనిని ప్రజలు గమనించాలని ఆమె కోరారు.

మధ్య తరగతి మందహాసం

ఆదాయ పన్ను పరిమితి పెంపుతో వేతన జీవులకు ఊరట



- కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితి పెంపుతో రైతులకు ప్రయోజనం
- కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా హర్షం

అనకాపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): **మధ్య తరగతి ప్రజలను మెప్పించేందుకు, వేతన జీవులకు ఊరట ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రయత్నం చేశారనే వాదన అధికంగా వినిపిస్తోంది. గత ఏడేళ్లుగా ఆదాయ పన్ను పరిమితులు, పన్నుల విధింపుపై కఠినంగా వ్యవహరించిన ఆమె ఈసారి భారీగా పన్ను మినహాయింపు ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.**

వేతన జీవులైతే ఒక్కపట్టాన నమ్మలేక పోతున్నారు. ఏడాదికి రూ.12 లక్షలు ఆదాయం అంటే నెలకు లక్ష రూపాయలు సంపాదించేవారు ఎటువంటి పన్ను కట్టాల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి ప్రకటించారు. మొదటి రూ.4 లక్షలకు పన్ను ఉండదని, రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు 5 శాతం పన్ను అంటే రూ.20 వేలు, ఆ తరువాత రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు పది శాతం పన్ను రూ.40 వేలుగా పేర్కొన్నారు. ఈ లెక్కన చూస్తే మొత్తం రూ.60 వేలు అవుతుంది. కానీ ఆదాయ పన్ను లెక్కించే ట్యాక్స్ కన్సల్టెంట్లు రిటర్న్ సమర్పించినప్పుడు రిబేట్ వస్తుందని, పన్ను సున్నా అవుతుందని చెబుతున్నారు. ఈ పన్ను విషయమై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పనిచేసే ఓ అధికారి అభిప్రాయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి కోరగా ఈ లెక్కలు అర్థం కావని, ఆదాయాన్ని ముందుగానే లెక్కకట్టి జీతంలో నెలనెలా కోత పెడతారని, ఆ తరువాత ఎంత వరకు వెనక్కి వస్తాయనేది చెప్పలేమన్నారు. నిజంగా ప్రభుత్వం చెప్పినట్టు రూ.12 లక్షల వరకు ఎటువంటి పన్ను పడకపోతే అంతకంటే సంతోషం మరొకటి ఉండదన్నారు.

వ్యవసాయంపై హర్షం

బడ్జెట్‌లో కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి ప్రస్తుతం ఉన్న రూ.3 లక్షలు నుంచి రూ.5 లక్షలకు పెంపుపైన నిర్ణయం తీసుకోవడంతో జిల్లాలో సుమారు 3.5 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. పప్పు, ధాన్యాల ఉత్పత్తికి స్వయం సమృద్ధి పథకం ... మిగతా 8వ పేజీలో



ప్రజారంజక బడ్జెట్



ఇది ప్రజారంజక బడ్జెట్. కేంద్రం, రాష్ట్రంలో డబల్ ఇంజిన్ సర్కారు ఉంటే ఎలా ఉంటుందో రుజు వైంది. కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి పెంచ డం, వ్యవసాయేతర రంగాలకు అధిక నిధులు కేటాయించడంతో రైతులు ఆర్థికంగా వృద్ధి చెందుతారు. ఉద్యోగులకు పన్ను రాయితీ రూ.12 లక్షలు పెంచడం ఉద్యోగ వర్గాలకు ఊరటనిచ్చే అంశం. రాష్ట్రానికి, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చారు. - **సీఎం.రమేశ్**, ఎంపీ, అనకాపల్లి

వ్యవసాయ రంగానికి చేయూత



బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రత్యేక కేటాయింపులు జరిపారు. ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి పథకానికి నిధులు కేటాయించడంతో రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుంది. కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి పెంచడంతో రైతుకు రుణ పరపతి పెరిగి పెట్టుబడులకు ఇబ్బందులు ఉండవు.
- **డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి**, ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ ఆర్థిక విభాగం, ఆర్ఏఆర్ఎస్, అనకాపల్లి

మధ్యతరగతి ఉద్యోగులకు ఊరట



బడ్జెట్ మధ్యతరగతి ఉద్యోగులకు ఊరటనిచ్చింది. ఆదాయ పన్ను మినహాయింపు రూ.12 లక్షలకు పెంచడం మంచి పరిణామం. శ్లాబ్ రేటులో మార్పులు చేయడం వల్ల మధ్యతరగతి ఉద్యోగులకు పన్ను మొత్తం తగ్గే అవకాశం ఉంది. రూ.12 లక్షలు ఆదాయం ఉన్నవారికి రూ.80 వేలు వరకు ఆదా అవుతుంది. గతంలో ఎన్నడూ మధ్యతరగతి ఉద్యోగులకు ఇంతలా ఆదాయ పన్ను మినహాయింపు ప్రయోజనం ఇవ్వలేదు.
- **ఎలమంచిలి శ్రీరామ్మూర్తి**, ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం, జిల్లా కార్యదర్శి, అనకాపల్లి

అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం



బడ్జెట్‌లో అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం ఇచ్చి కేటాయింపులు జరిపారు. వికసిత్ భారత్ లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలకు నిధులు తగ్గించి, సంస్కరణలకు పెద్దపీట వేశారు. గ్రామీణ వ్యవసాయేతర రంగాలకు బడ్జెట్‌లో అరకొరగానే కేటాయింపులు జరిగాయి.- **డాక్టర్ బోయిన వెంకటరమణ**, అర్థశాస్త్ర అధ్యాపకుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎలమంచిలి

కరక రంగురాళ్ల క్వారీలో నిషేధాజ్ఞల ఉల్లంఘనపై సీరియస్

రేంజ్ ఆఫీసులో రెండో రోజూ కొనసాగిన విచారణ

- ముందస్తు అనుమతి లేకుండా కరక కొండెక్కిన మైనింగ్ అధికారులు
- మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌తో సహా ఐదుగురు సిబ్బందిని అదుపులోకి తీసుకున్న అటవీశాఖ అధికారులు
- విచారణ జరిపి స్టేట్‌మెంట్లు రికార్డు చేసిన రేంజర్


కరక కొండపై అటవీ శాఖ ఏర్పాటు చేసిన బేస్ క్యాంప్

నర్సీపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ముందస్తు అనుమతి లేకుండా కేంద్ర ప్రభుత్వ నిషేధాజ్ఞలు అమలులో ఉన్న కరక రిజర్వ్ ఫారెస్టులోకి అడుగుపెట్టిన మైనింగ్ అధికారులు రెండో రోజూ విచారణకు హాజరయ్యారు. శనివారం మధ్యాహ్నం రేంజ్ ఆఫీసులో మైనింగ్ అధికారులతో పాటు, సాలిక మల్లవరానికి చెందిన ఇద్దరు ప్రైవేటు వ్యక్తులను అటవీ అధికారులు విచారించారు. రిజర్వ్ ఫారెస్టులో సర్వే చేయమని ఉన్నతాధికారుల ఆదేశాలు ఏమైనా ఉంటే రికార్డులు చూపించాలని అడిగారు. శనివారం మధ్యాహ్నం జరిపిన విచారణలో శుక్రవారం చెప్పిన సమాచారమే చెప్పారని, పెద్దగా మార్పు లేదని రేంజ్ అధికారి లక్ష్మీనర్సు తెలిపారు.

కరక కొండపై వజ్ర, వైడూర్య నిక్షేపాలు!

కోట్లాది రూపాయల విలువ చేసే వజ్ర, వైడూర్య నిక్షేపాలు ఉన్న కరక కొండ పై పెద్దల కన్ను పడినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. అందుకే మైనింగ్ అధికారులను రంగంలోకి దింపారని అంటున్నారు. అమరావతి నుంచి గనులు, భూగర్భ శాఖ ఓఎస్‌డీ ఆదేశాలతోనే కరక కొండ మీదకు రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌ను, సిబ్బందిని పంపారని నర్సీపట్నం మైనింగ్ ఏడీ విలేకరులకు చెప్పడాన్ని బట్టి చూస్తుంటే పెద్ద స్థాయిలో స్కెచ్ సిద్ధం చేస్తున్నట్టు అర్థమవుతోంది. గతంలో కరక రంగురాళ్ల తవ్వకాలకు అనేక ప్రయత్నాలు జరిగినప్పటికీ నిషేధాజ్ఞలు అమలులో ఉండడం, అటవీ అధికారులు కట్టుదిట్టమైన చర్యల కారణంగా కరక రిజర్వ్ ఫారెస్టులోకి ఎవరూ అడుగు పెట్టలేదు. ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో మైనింగ్ అధికారులను రంగంలోకి దింపి రంగురాళ్ల తవ్వకాలకు సర్వే చేయించడానికి ప్రయత్నాలు జరుగుతుండడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

మైనింగ్ అధికారులపై చర్యలు

ముందస్తు అనుమతి లేకుండా కరక కొండపై సర్వే చేయడానికి మైనింగ్ అధికారులు వెళ్లి అటవీ ఉన్నతాధికారులకు అడ్డంగా దొరికిపోయిన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం కరక రంగురాళ్ల క్వారీలోకి ప్రవేశించిన వారిలో మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తి, మైనింగ్ జువాలజీ విభాగానికి చెందిన పోతి శివకుమార్, కూర్మదాసు అప్పలనాయుడు, వి.వీరనాగేశ్వరరావు, జి.రామచంద్రరావుతో పాటు సాలికమల్లవరానికి చెందిన ... మిగతా 8వ పేజీలో

అరకు చలి ఉత్సవ్ అదరహో

- రెండో రోజూ రెట్టింపు ఉత్సాహం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


ట్రైబల్ ఫ్యాషన్ షో నిర్వహిస్తున్న దృశ్యం



రోబో షో

అరకులోయలో నిర్వహిస్తున్న అరకు చలి ఉత్సవ్ రెండో రోజైన శనివారం ఉత్సాహంగా సాగింది. ఉత్సవ్ జరిగే అరకులోయ డిగ్రీ కళాశాల మైదానం సందర్శకులతో కిటకిటలాడింది. ప్రధాన వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు రకాల గిరిజన సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేశాయి. - అరకులోయ/ఆంధ్రజ్యోతి

జిల్లాలో 93.42 శాతం పింఛన్ల పంపిణీ

అనకాపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం సాయంత్రానికి 93.42 శాతం పూర్తయింది. అనకాపల్లి జీవీఎంసీ, నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల పరిధిలో 2,57,457 మంది లబ్ధిదారులకు రూ.107 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5 గంటల సమయానికి 2,41,757 మందికి (93.42 శాతం) సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. వివిధ పనులపై ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిన లబ్ధిదారులకు, వలస వెళ్లిన వారికి మాత్రమే పంపిణీ చేయలేదని డీఆర్‌డీఏ పీడీ శశీదేవి తెలిపారు. జిల్లాలో శత శాతం పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు.

అధిష్టాన్ పరిశ్రమ వద్ద ఉద్రిక్తత

ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళా కార్మికుల ఆందోళన

- జీతాలు పెంచాలని డిమాండ్
- చర్చలు జరిపిన పరిశ్రమ భారత భాగస్వామి దొరస్వామి, కార్మిక శాఖాధికారిణి రమ్య
- హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించిన కార్మికులు


అధిష్టాన్ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేస్తున్న మహిళా ఉద్యోగులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): **అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లో గల అధిష్టాన్ (బ్రాండిక్స్) వస్త్ర తయారీ పరిశ్రమ ఎదుట శనివారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అదనంగా అరగంట పని వేళలు పెంచడం, ఇతర ప్రోత్సాహకాలను నిలిపివేస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించడంతో మహిళా కార్మికులు శనివారం ఉదయం ఆందోళన చేపట్టారు. ఒకానొక దశలో ఇది తీవ్ర రూపం దాల్చింది. అయితే సాయంత్రం ఆ సంస్థ భాగస్వామి దొరస్వామి, కార్మిక శాఖాధికారిణి రమ్య స్పష్టమైన హామీ ఇవ్వడంతో మహిళా కార్మికులు ఆందోళన విరమించారు.**

అధిష్టాన్ వస్త్ర తయారీ పరిశ్రమలో బీ1, బీ2, బీ3 అనే మూడు యూనిట్లు ఉన్నాయి. ఈ మూడు యూనిట్లలో శనివారం ఉదయం సుమారు నాలుగు వేల మంది ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు టిఫిన్ బ్రేక్ సమయంలో మూడు యూనిట్లకు చెందిన ... మిగతా 8వ పేజీలో


శనివారం సాయంత్రం ఉద్యోగులకు హామీ ఇస్తున్న దొరస్వామి, కార్మిక శాఖాధికారిణి రమ్య

సుజల స్రవంతి ప్రాజెక్టు కాలువకు 1,850 ఎకరాలు సేకరణ

జిల్లాలో 22 గ్రామాల గుండా కాలువ నిర్మాణం

- పరిహారం నిధులు విడుదలకాగానే పనులు ప్రారంభం
- ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి


మాట్లాడుతున్న ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొయ్యు రమామణి

సబ్బవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నుంచి భూదేవి చెరువు వద్ద నిర్మించనున్న బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నీటిని తరలించేందుకు అవసరమైన కాలువను తవ్వేందుకు అనకాపల్లి జిల్లాలోని మూడు మండలాల్లో గల 22 గ్రామాల్లో 1,850 ఎకరాల భూమిని సేకరించామని ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొయ్యు రమామణి తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ జిల్లాలో కశింకోట మండలంలో మూడు గ్రామాలు, అనకాపల్లి మండలంలో 9 గ్రామాలు, సబ్బవరం మండలంలో 9 గ్రామాల్లో రైతుల నుంచి భూమిని సేకరించామన్నారు. అధికారులు సేకరించిన భూమిలో 1200 ఎకరాలు జిరాయితీ, 650 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. మండలంలో వంగలి గ్రామ రైతులు(సుమారు 45 ఎకరాలు) పరిహారం విషయంలో సుముఖంగా లేకపోవడంతో ఆ గ్రామాన్ని మినహాయించి 21 గ్రామాలకు సంబంధించి ప్రిలిమినరీ నోటిఫికేషన్(పీఎన్), డ్రాఫ్ట్ డిక్లరేషన్(డీడీ) పబ్లిష్ చేశామన్నారు. మండలంలోని అంతకాపల్లి గ్రామంలో తమకు ఇచ్చిన సర్వే నంబర్లు అన్నీ జిరాయితీ అని ఉందని, రికార్డుల ప్రకారం సుమారు 30 ఎకరాలకు గాను రైతులకు సుమారు రూ.1000 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.500 కోట్లు డిపాజిట్ చేస్తే రైతులకు చెల్లించి, కాలువ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ పాల్గొన్నారు.

వ్యసనాలతో బతుకులు ఆగం

కుటుంబాలు ఛిన్నాభిన్నం

- పెరుగుతున్న మద్యం, స్మార్ట్ ఫోన్, ఆన్‌లైన్ బెట్టింగ్/గేమ్స్ అడిక్షన్
- వద్దని కుటుంబ సభ్యులు వారిస్తే దాడులకు కూడా వెనుకాడని వైనం
- తాజాగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని వారించినందుకు తల్లిని హత్య చేసిన యువకుడు
- దుర్వ్యసనాలకు బానిసలైన వారిలో మానసిక సమస్యలు
- అప్రమత్తత అవసరం
- కౌన్సెలింగ్, మందుల వినియోగం ద్వారా సాధారణ స్థితికి తేవచ్చునంటున్న వైద్యులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడవద్దని వారించినందుకు తల్లిపై కత్తితో దాడి చేశాడో కొడుకు'...ఈ సంఘటన శుక్రవారం నగరంలోనే చోటుచేసుకుంది.

'ఫోన్‌లో గేమ్స్ ఆడుకోనివ్వడం లేదని హరియాణాలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి (15) ఆత్మహత్యకు పాల్పడ్డాడు'

'కృష్ణా జిల్లాలో మద్యానికి బానిసై ఒక యువకుడు ఎక్కడికక్కడ అప్పులు చేశాడు. ఒకరోజు తండ్రి గట్టిగా మందలించడంతో అతనిపైనే గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు'

మద్యం, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్...వంటి వాటికి బానిసలుగా మారి కొందరు వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పే కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులను శత్రువులుగా భావిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వారిపై దాడులకు పాల్పడడం చేస్తున్నారు.

తీవ్రమైన స్థాయిలో ప్రతిఘటన

మద్యం, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ వంటి వాటిని మొదట్లో సరదాగా ప్రారంభిస్తారు. ఆ తరువాత వదలలేని పరిస్థితికి చేరుకుంటారు.



ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలైన విద్యార్థులు తరగతి గదిలో ఉన్నా వారి ఆలోచనలన్నీ వాటి చుట్టూనే తిరుగుతుంటాయి. ఎంత వేగంగా ఇంటికి వెళదామా?, అని ఆలోచిస్తారు. ఇది క్రమంగా వ్యసనంగా మారి గంటల తరబడి ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుతుంటారు. మద్యం, బెట్టింగ్‌కు బానిసలైనవారు తమ డబ్బులు లేక పోయినా అప్పు చేసి మరీ తాము కోరుకున్నది చేయాలని భావిస్తారు. ఈ క్రమంలో వద్దని వారించే వారిపై దాడులకు కూడా వెనుకాడరని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఇవీ లక్షణాలు

ఇటువంటి వ్యసనాలు (అడిక్షన్స్)తో బాధపడే వారిలో కొన్ని లక్షణాలు ఉంటాయి. తీవ్రమైన ఆందోళన, గాబరాతో ఉంటారు. ఇంటికి ఆలస్యంగా వస్తుంటారు. వచ్చిన ... మిగతా 8వ పేజీలో

ఘనంగా ఆడారి తులసీరావు జయంతి



తులసీరావు విగ్రహం వద్ద ఆనంద్, ఎంపీపీ గోవింద్ తదితరుల నివాళి

ఎలమంచిలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు జయంతిని ఇక్క డున్న ఆయన ఘాట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో అభిమానులు, డెయిరీ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. తులసీరావు కుమారుడు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, కుమార్తె, మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, ఆడారి జయమ్మ, సంతోష్‌లు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పిళ్లా రామకృష్ణ, ఆడారి శ్రీధర్, ఆడారి వెంకట్, డెయిరీ డైరెక్టర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం తులసీ తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు.

వ్యసనాలతో బతుకులు ఆగం

... 7వ పేజీ తరువాయి

వెంటనే ఫోన్/కంప్యూటర్ ముందు కూర్చుంటారు. తినే సమయంలో కూడా ఫోన్‌తోనే గడుపుతారు. ప్రతి చిన్నదానికి తీవ్రంగా స్పందిస్తుంటారు. గట్టిగా కేకలు వేయడం, అరవడం చేస్తుంటారు. మద్యం/డ్రగ్స్ వంటి వాటికి బానిసలైన వారిలో ఆందోళన, పనిపై శ్రద్ధ పెట్టలేకపోవడం, డబ్బులు కోసం వెతకడం, అప్పులు చేయడం, ఇంటికి ఆలస్యంగా రావడం, కుటుంబ సభ్యులతో మాట్లాడకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. బెట్టింగ్ అడిక్షన్‌తో బాధపడేవారిలోనూ ఇటువంటి లక్షణాలే ఉంటాయి. అప్పులు చేయడం, పనిపై శ్రద్ధ పెట్టక పోవడం, తప్పుడు మార్గాలను అనుసరించడం, కుటుంబ సభ్యులపై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేయడం వంటి లక్షణాలు ఉంటాయి. ఇంట్లో తెలియకుండా భారీగా అప్పులు చేస్తుంటారు.

చికిత్స ఇలా..

ఇటువంటి వ్యసనాలతో బాధపడే వారికి లక్షణాలను బట్టి చికిత్స చేయించాల్సి ఉంటుంది. మందులు, కౌన్సెలింగ్, గ్రూప్, ఫ్యామిలీ థెరపీలతో సాధారణ స్థితికి తీసుకురావచ్చు. వీరి వ్యవహారశైలిని నిశితంగా గమనించడం ద్వారా ప్రాథమిక దశలోనే చాలావరకు సమస్యను గుర్తించేందుకు అవకాశం ఉంది.

అన్ని వయసుల వారిలోనూ..

ఫోన్ అడిక్షన్ తొమ్మిది నుంచి 25 ఏళ్లలోపు వారిలో అధికంగా కనిపిస్తోంది. మద్యం/డ్రగ్స్ వంటి వాటికి బానిసలుగా మారుతున్న వారిలో 20 నుంచి 50 ఏళ్లలోపు వయసువారు ఉంటున్నారు. జూదాలకు అలవాటుపడిన వారిలో 20 నుంచి 40 ఏళ్లలోపువారు అధికంగా ఉంటున్నారు. విద్యార్థులు, ఉద్యోగాలు చేసే వాళ్లు ఈ తరహా వ్యసనాలకు బానిసలుగా మారు తున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రాథమిక స్థాయిలో గుర్తించడం కీలకం

- డాక్టర్ రామిరెడ్డి, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్

వ్యసనం స్థాయికి వెళ్లడానికి కొంత సమయం పడు తుంది. కనీసం మూడు నుంచి ఆరు నెలలు సమ యంలో అలవాటు వ్యసనంగా మారి అది లేకపోతే ఉండలేని స్థితికి చేరుతుంది. ఈ సమయంలోనే సదరు అలవాట్లను గుర్తించి వాటికి వారిని దూరం చేయడం చాలా సులభం. వ్యసనం నుంచి విముక్తి చేసేందుకు మందులు, కౌన్సెలింగ్ వంటివి ఉన్నాయి. అందుకు వాళ్లు సహకరించే పరిస్థితి కొన్నిసార్లు ఉండదు. ఈ తరహా వ్యసనాలతో బాధపడే వారిలో కొన్ని మానసిక సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి ప్రవర్తించే తీరు భిన్న రకాలుగా ఉంటుంది. సకాలంలో గుర్తించి మెరుగైన వైద్య సేవలు, కౌన్సెలింగ్ అందించడం అత్యంత కీలకం.



ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఎలమంచిలిలో మంచు



రైల్వే స్టేషన్ వద్ద..

ఎలమంచులి

- తెల్లవారుజాము మూడు గంటల నుంచి ఆరంభం
- ఉదయం 8.30 గంటలైనా వీడని తెరలు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పరిసర ప్రాంతాల ప్రజలు



ఎలమంచిలి ప్రధాన రహదారిపై మంచు ముసుగులో రాకపోకలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణ, పరిసర ప్రాంతాలు శనివారం ఏజెన్సీ వాతావరణాన్ని తలపించాయి. వేకువజాము మూడు గంటల నుంచి అంతటా దట్టంగా పొగమంచు కమ్ముకుంది. ఉదయం ఎనిమిదిన్నర గంటలైన మంచుతెరలు వీడలేదు. ఎదురుగా ఉన్న మనిషి సైతం కనిపించని పరిస్థితి నెలకొనడంతో అంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనచోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. ప్రధాన రహదారిపై వాహనాలు నెమ్మదిగా ప్రయాణం సాగించాయి. ఎలమంచిలి రైల్వే స్టేషన్, బస్టాండ్‌తో పాటు ప్రధాన జంక్షన్లలో మంచు జల్లుల్లా కురవడంతో బోసిపోయి కనిపించాయి. ఇంతకు ముందెన్నడూ ఇంతలా మంచు చూడలేని పలువురు తెలిపారు. అయితే కొందరు యువకులు మాత్రం ఈ వాతావరణాన్ని తెగ ఎంజాయ్ చేస్తూ సెల్ఫీలకు దిగుతూ సందడి చేశారు.

అపరాలు, మొక్కజొన్న పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

- తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం ఎలమంచిలితో పాటు పులపర్తి, కృష్ణాపురం గ్రామాల్లో శనివారం అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, ఎలమంచిలి శాస్త్రవేత్తలు పర్యటించారు. ఈ సందర్భంగా అపరాలు, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్.ఎస్. కుమారి, ఏవో మోహన్‌రావు మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రామాలు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే, అపరాలపై బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అపరాలలో మారుకా మచ్చల పురుగు ఆశించే అవకాశం కూడా ఉన్నందున పురుగు ఉధృతి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. నివారణకు క్లోరోపైరిఫాస్ 2.5 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి చల్లాలన్నారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అలాగే, పలు పంట సాగులో పద్ధతులను వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారి అరుణ తదితరులు పాల్గొన్నారు.



పులపర్తిలో అపరాల పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గ్రామ కంఠాల ఆక్రమణలు తొలగింపు

మునగపాక, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాలను, కొండ ప్రాంతాలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ ఆదిఉమా మహేశ్వరరావు హెచ్చరించారు. మండలంలో ఒంపోలు, కాకరాపల్లి, వెంకటాపురం గ్రామాల్లో గ్రామ కంఠాల్లో అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం పలుచోట్ల తొలగింపు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణ చట్టవిరుద్ధమన్నారు. ఆక్రమించేవారు ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు ప్రజలు కూడా ఇటువంటి ఆక్రమణలపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.



ఒంపోలులో ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న తహసీల్దార్

రథసప్తమికి గొల్లల కొండపై భారీ ఏర్పాట్లు

ఎలమంచిలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గొల్లల కొండపై కొలువుదీరిన సూర్యనారాయణమూర్తి ఆల యంలో రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. నాలుగో తేదీ మంగళవారం వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు ప్రారంభం కానున్నాయని నిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించనున్నామన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన డీపీవో

అచ్యుతాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం తెల్లవారుజామునే మండలంలో ప్రారంభమైంది. ప్రభుత్వ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. మోసయ్యపేటలో జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి పలువురికి ఈ నగదును అందజేశారు. అనంతరం రామన్నపాలెంలో సంపద కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఇక్కడ భారీగా పేరుకుపోయిన చెత్తను ఎక్సకవే టర్ సహాయంతో లారీలపై విశాఖలోని ఉప్పాడకు తరలించే ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీరామనాయుడు, రామన్నపాలెం సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధ్య తరగతి మందహాసం

... 7వ పేజీ తరువాయి

బడ్జెట్ కేటాయింపులపై రైతు వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పోలవరం పనులకు మార్గం సుగమం

పోలవరం ప్రాజెక్టుకు గతేడాదికంటే కేటాయింపులు పెరగడంతో జిల్లాలో ఎడమ కాలువ పనులు పూర్తయ్యేందుకు మార్గం సుగమం కానుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెండింగ్‌లో ఉన్న పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసేందుకు రూ.800 కోట్ల అంచనాలతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. బడ్జెట్ కేటాయింపుల్లో పోలవరానికి అదనపు నిధులు కేటాయింపులు జరపడంతో ఎడమ కాలువ పనులకు మోక్షం లభించనున్నదని జిల్లా ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎంఎస్ఎంఈలకు ఊతం

ఇంకా కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన పలు పథకాల వల్ల విశాఖ జిల్లా ప్రజలకు భవిష్యత్తులో అనేక ప్రయోజనాలు కలుగుతాయి. పారిశ్రామికంగా అభివృద్ధి సాధ్యమవుతుంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.20 కోట్ల వరకు రుణాలు తీసుకునే వెసులుబాటు కల్పించారు. దేశంలో కోటికిగా పైగా ఎంఎస్ఎంఈలు ఉండగా వాటి ద్వారానే 45 శాతం ఎగుమతులు జరుగుతున్నాయి. విశాఖపట్నాన్ని తీసుకుంటే స్టీల్‌ప్లాంటు, షిప్‌యార్డు వంటి భారీ పరిశ్రమలకు అనుబంధంగా వందలాది ఎంఎస్ఎంఈలు పనిచేస్తున్నాయి. వాటిలో వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. వాటికి రుణ రూపేణా ఊతం ఇస్తే ఉపాధి, ఉత్పత్తులు మరింత పెరుగుతాయి.

పెరగనున్న మెడికల్ సీట్లు

- దేశంలోని వైద్య కళాశాలల్లో పది వేల మెడికల్ సీట్లు పెంచుతామని ప్రకటించారు. దీనివల్ల విశాఖపట్నం, పాడేరు, అనకాపల్లి జిల్లాలలోని వైద్య కళాశాలల్లో అదనపు సీట్లు లభిస్తాయి.

పర్యాటకంగానూ...

దేశంలో ఉపాధికి అపార అవకాశాలు ఉన్న పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తామని ప్రకటించారు. అత్యుత్తమమైన 50 పర్యాటక కేంద్రాల అభివృద్ధికి నిధులు ఇస్తామన్నారు. ఆయా కేంద్రాల్లో హోటళ్లు, డెస్టినేషన్ సెంటర్ల నిర్మాణానికి సహాయం చేస్తారు. విశాఖపట్నం, అరకులోయ ఈ కోవలోకి వస్తాయి. నిధులు వచ్చే అవకాశం ఉంది.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



అంతిక్రియల్లో కుమార్తె నిహారిక



మృతుడు జగన్నాథరావు(ఫైల్)

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తండ్రికి కుమార్తె అంత్యక్రియలు పూర్తి చేశారు. వివరాలి.. మండల కేంద్రానికిచెందిన మళ్ల జగన్నాధరావు (48) శుక్రవారం గుండె పోటుతో మృతి చెందాడు. జగన్నాధరావు కూరగాయల వ్యాపారి. ఇందులో భాగంగా శుక్రవారం నక్కపల్లి మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు అమ్ముతుండగా ఆయనికి ఒక్కసారిగా గుండె పోటు రావడంతో స్థానికులు ఆయనను సమీపంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే మృతుడికి కుమారులులేరు. ఉన్న ఒక్క కుమార్తె నిహారిక హైదరాబాద్ ఉద్యోగం చేస్తున్నారు. ఆమె అక్కడి నుంచి బయలుదేరి తన గ్రామానికి వచ్చి శనివారం నిర్వహించిన అంత్యక్రియల్లో నిహారికతండ్రికి తలకొరివి పెట్టి కన్న రుణాన్ని తీర్చుకొంది.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ వీధిలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ వీధిల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

మురికి నీటిలో కూరుకుపోయిన ఆవు

- అర్ధ గంటపైగా శ్రమించి కాపాడిన యువకులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రధాన డ్రెయినేజీలో శనివారం ఆవు కూరుకుపోయింది. ఈ మూగజీవి బయటకు వచ్చేందుకు ఎంత ప్రయత్నించినా సాధ్యం వీలుకాక కళ్లు తేలేసింది. దీన్ని గుర్తించిన యువకులు ఆవును తాళ్లతో కట్టి అర్ధగంటపాటు శ్రమించి బయటకు తీశారు. కాలువలో పూడికలు తొలగించాలని వారు అధికారులను కోరారు.



ఆవును తాళ్లతో పైకి లాగుతున్న యువకులు

వమ్మవరం చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు

- చెరువు గట్టు తొలగింపు.. మట్టిని ఇటుక బట్టీలకు తరలింపు

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరం చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎక్సకవేటర్ సాయంతో గట్టును సైతం తవ్వేసి ఆ మార్గం ద్వారా చెరువులోకి ప్ర వేశించి మట్టిని ట్రాక్టర్లతో తరలించారు. ఈ మట్టిని ట్రాక్టర్లతో చెరువుకు సమీపంలో ఉన్న ఇటుకుల బట్టీలకు తరలిస్తున్నట్టు స్థానికులు తెలిపారు. అయితే, చెరువలో ఎప్పటికప్పుడు మట్టి తవ్వకాలు జరుగుతున్నా కూడా ఇరిగేషన్ అధికారులు అరికట్టలేకపోతున్నారు. ఇటీవల కొద్ది రోజుల క్రితం అధికారులు అక్కడికి వెళ్లి తవ్వకాలు జరిగిన ప్రదేశాలను పరిశీలించడంతోపాటు అక్కడ తవ్వేసి ఉన్న చెరువు గట్టును మూయించారు.



తవ్వేసిన చెరువు గట్టును



వమ్మవరం చెరువులో మట్టి తవ్వకాలు జరిగిన ప్రదేశం

అయితే, కొందరు మళ్లీ శుక్రవారం రాత్రి అదే చెరువు గట్టును తవ్వేసిమళ్లీ మట్టిని తరలించారు.

ఇటుక బట్టీలకు నోటీసులు ఇస్తాం -భాను, ఇరిగేషన్ ఏఈ

దీనిపై ఇరిగేషన్ ఏఈ భానును వివరణ కోరగా వమ్మవరం చెరువులో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మట్టి తవ్వకాలు చేపట్టి ఇటుక బట్టీలకు తరలించినట్టు తెలిసిందన్నారు. ఈ నేపథ్యంలో ఇటుక బట్టీల యజమానులకు నోటీసులు అందజేస్తామన్నారు. అలాగే, ఈ తవ్వకాలపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

పేకాటశిబిరంపై దాడి

నక్కపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామ సమీపంలో తోటల్లో పేకాట శిబిరంపై శనివారం సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు నేతృత్వంలో సిబ్బం ది దాడి చేశారు. రూ. 6,140లు నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

కేంద్ర బడ్జెట్ భేష్

- సామాజిక కార్యకర్త సత్యనారాయణ



పాయకరావుపేట : కేంద్ర ఆర్థిక మంత్రి శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ అభినందనీయమని పట్టణానికి సామాజిక కార్యకర్త జీవీవీ సత్యనారాయణ అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మధ్యతరగతి ఉద్యోగులు, నెలకు రూ. లక్ష వరకు జీతం తీసుకునేవారు టాక్స్ నుంచిమినహాయించడం ఊరట నిచ్చిందన్నారు.ఈ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి పెద్దపీట వేయడం రాష్ట్ర అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు.

7న 'లక్ష డప్పులు వేల గొంతులు' జయప్రదం చేయాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు



టీఎల్ఆర్ సేవా సమితి అందజేసిన డప్పులను పంపిణీచేస్తున్న నాగరాజు

పాయకరావుపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో చేపట్టనున్న లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో సమావేశాలు పూర్తిచేసుకుని హైదరాబాద్ తిరిగివెళుతున్న ఎం.నాగరాజు శనివారం పాయకరావుపేట వద్ద కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయనను అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు తుమ్మలపల్లి కుమార్, వార్డు సభ్యుడు తుమ్మలపల్లి సతీష్ తదితరులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంపల బాబూరావు, ద్రాక్షారపు రాజేష్, మార్త తేజ, అబ్బులు, ఆరుగుల కృష్ణ, ఉల్లంపర్తి ప్రసాద్, చింటూ, ఎత్తుల మణి తదితరులు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి'

పాయకరావుపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో భవన నిర్మాణ కార్మికులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ఆదుకోవాలని తుని, పాయకరావుపేట తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు డిమాండ్ చేశారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ఈమేరకు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నారాయణరావు మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భవన నిర్మాణ బోర్డు ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ బోర్డును రద్దుచేసి కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. కరోనాతోపాటు జగన్ ప్రభుత్వం నూతన పాలసీ తేవడంతో రాష్ట్రంలో ఇసుక లభ్యంకాక భవన నిర్మాణ కార్మికులకు పనులులేక ఆర్థిక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఆ సమయంలో కేంద్రం భవన నిర్మాణ కార్మికులకు రూ.10 వేలు సాయం ప్రకటిస్తే జగన్ ప్రభుత్వం ఆ సొమ్ము భవన నిర్మాణ కార్మికులకు ఇవ్వలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందా శ్రీనివాసరావు, మేకల సత్తిబాబు, కూండ్రపు చంటి, యరకయ్య, పడాల నారాయణరావు, మేడిశెట్టి కృష్ణ, గౌరి, థామస్ పాల్గొన్నారు.



పాయకరావుపేటలో ర్యాలీ చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఎస్. రాయవరం: భవన నిర్మాణ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు గనిశెట్టి ఏసుదాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పెట్టుగోళ్లపల్లిలో శనివారం నూతనంగా తాపీ మేస్త్రీల వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. అనంతరం ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శిలు పి భవర్‌లాల్ రాజు, చంబకాయల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా పీవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాక్షుడు కె .అప్పలరాజు, కార్యదర్శులుగా కుమార్, రాజు, సహాయ కార్యదర్శులుగా ఎం రాంబాబు, ఎ. గోవింద్ ఎన్నికయ్యారు.

కరక రంగురాళ్ల క్వారీలో నిషేధాజ్ఞల ఉల్లంఘనపై సీరియస్

... 7వ పేజీ తరువాయి

కె.కొండలరావు, అల్లు నూకరాజు ఉన్నారు. కరక రిజర్వ్ ఫారెస్టులో తవ్వకాలు జరిపిన ప్రాంతానికి వెళ్లడానికి సాలికమల్లవరానికి చెందిన కొండలరావు, నూకరాజు సహాయంతోనే మైనింగ్ అధికారులు ప్రయత్నం చేశారు. వీరందర్ని పూర్తి స్థాయిలో విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ అధికారి శామ్యూల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉంటే ఆధారాలతో విచారణకు రావాలని కోరామని చెప్పారు.

సాలికమల్లవరం, పప్పుశెట్టిపాలెంలో...

గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం, సాలికమల్లవరంలో కూడా రంగురాళ్ల తవ్వకాలకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పప్పుశెట్టిపాలెం రంగురాళ్ల లీజ్ క్వారీలో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. సాలికమల్లవరం క్వారీని కూడా మైనింగ్ అధికారులు పరిశీలించారు.

మైనింగ్ అధికారికి షోకాజ్ నోటీసు ఇస్తాం

అనకాపల్లి మైనింగ్ ఏడీ ఎం.శ్రీనివాస్, మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తి, నలుగురు సహాయ సిబ్బంది శనివారం విచారణకు హాజరయ్యారు. ముందస్తు అనుమతి లేకుండా రిజర్వ్ ఫారెస్టులోకి వెళ్లడం తప్పు అయిపోయిందని మైనింగ్ అధికారులు అటవీ రేంజ్ అధికారి వద్ద అంగీకరించారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్న కరక రిజర్వ్ ఫారెస్టులోకి వెళ్లిన ఘటనపై రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తికి షోకాజ్ నోటీసు జారీ చేస్తామని అటవీశాఖ రేంజ్ అధికారి లక్ష్మీనర్సు చెప్పారు. కరక రిజర్వ్ ఫారెస్టులోకి ఎందుకు వెళ్లారని లిఖిత పూర్వకంగా వివరణ కోరతామని తెలిపారు.

అధిష్టాన్ పరిశ్రమ వద్ద ఉద్రిక్తత

... 7వ పేజీ తరువాయి

మహిళా ఉద్యోగులు ఒకేసారి బయటకు వచ్చి ఆందోళనకు దిగారు. దీంతో కర్మాగారం ప్రతినిధులు యూనిట్ ప్రధాన గేట్లను మూసివేశారు. ఇంతలో కొందరు మహిళా ఉద్యోగులు గేట్లు తోసుకొని కర్మాగారం ప్రధాన గేట్ల వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. మిగిలిన వారంతా ఆయా యూనిట్ల వద్ద ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న భారత భాగస్వామి దొరస్వామి కర్మాగారం లోపల యూనిట్ల వద్ద ఉన్న ఉద్యోగులతో చర్చించారు. అదనంగా పెంచిన అరగంట సమయాన్ని రద్దు చేస్తున్నామని, వెంటనే విధులకు హాజరుకావాలని కోరారు. కానీ మహిళా ఉద్యోగులు ఆందోళన విరమించలేదు. కర్మాగారం సిబ్బంది వేధింపులు మానుకోవాలని, వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. జీతాలు పెంచడానికి కొంత సమయం కావాలని దొరస్వామి కోరినా తక్షణమే నిర్ణయం తెలపాలని ఉద్యోగులు పట్టుబట్టారు. చేసేది లేక దొరస్వామి వెనుతిరిగారు. మధ్యాహ్నం కర్మాగారంలో ఉన్న వారందరినీ వెనుక గేట్ల నుంచి వాహనాల ద్వారా బయటకు పంపించడానికి ప్రయత్నించారు. ఈ వాహనాలను రెండవ షిఫ్ట్‌కు వచ్చిన కార్మికులు అడ్డుకున్నారు. ముందస్తుగా సీపీఎం, సీఐటీయూ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆందోళన విరమణ

అధిష్టాన్ వస్త్ర తయారీ పరిశ్రమ భారత భాగస్వామి దొరస్వామి, కార్మిక శాఖాధికారిణి రమ్య శనివారం సాయంత్రం ఆరు గంటలకు స్పష్టమైన హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.దొరస్వామితో పాటు రమ్య ఉద్యోగులతో సుదీర్ఘంగా చర్చించారు. పది రోజుల్లో జీతాలు పెంచాలని ఉద్యోగులు పట్టుబట్టారు. కనీసం నెల గడువు ఇస్తే తప్ప జీతాలు పెంచలేమని దొరస్వామి తేల్చి చెప్పారు. తెగే వరకు లాగవద్దని రమ్య నచ్చజెప్పారు. దీంతో కార్మికులు శాంతించి ఆందోళన విరమించారు.

ఆకలి సూచీలో 106వ స్థానంలో భారత్

- రైతుల ఆత్మహత్యలు.. ఆకలిచావులను పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం: ఎంఏ బేబి
- కేంద్రం హోదా ఇస్తే.. పరిశ్రమలు అవే వస్తాయి: వీఎస్ఆర్
- నెల్లూరులో ప్రారంభమైన సీపీఎం రాష్ట్ర మహాసభలు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచంలోని 127 దేశాల్లో ఆకలి సూచికలో భారతదేశం 106వ స్థానంలో ఉంది. కడుపు నిండా తిండి పెట్టలేని పరిస్థితి దేశంలో ఉంది' అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబి వెల్లడించారు. ఆపార్టీ 27వ రాష్ట్ర మహాసభలు శనివారం నెల్లూరులో ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఈ సభలు జరిగే అనిల్ గార్డెన్స్‌కు సీతారాం ఏచూరి ప్రాంగణంగా నామకరణం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబి మాట్లాడుతూ.. 'దేశంలో ఆకలి కేకలు వినిపిస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. ఆర్థికవేత్తలు ఎన్ని సూచనలు చేసినా కేంద్రం తగిన విధంగా స్పందించకపోవటంతో గిరిజనులు, వెనుకబడిన వర్గాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. గడిచిన ఎనిమిదేళ్లలో 1,00,474 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతి 24 గంటలకు 34 మంది రైతులు, కూలీలు ఆత్మహత్య చేసుకుంటుంటే బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తోంది? ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పూర్తిగా ముస్లింలు ఉన్న నియోజకవర్గాల్లో బీజేపీ గెలవడానికి కారణం... కొన్ని ప్రాంతాల్లో ముస్లిం ఓటర్లను ఓట్లు వేయకుండా భయపెట్టింది. మరికొన్ని చోట్ల భయపెట్టి ఓట్లు వేయించుకుంది. వామపక్ష నేతలు అధికారంలో ఉన్న దేశాల్లో ఎన్నో సంస్కరణలు జరుగుతున్నాయి. ఆయా దేశాలను చూసి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది' అని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.... 'బీజేపీ, మతతత్వాన్ని రెచ్చగొట్టి మతాల మధ్య చిచ్చు పెడుతోంది. ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఏపీకి ఇప్పటివరకు రూ.3 లక్షల కోట్ల నిధులు ఇచ్చినట్లు ప్రకటించారు. ఆ నిధులు ఏమయ్యాయో సీఎం చంద్రబాబు స్పష్టం చేయాలి. ఈ నిధులే వచ్చి ఉంటే రాష్ట్రంలో టీడీపీ ఇచ్చిన హామీల ప్రకారం రైతులకు రూ.20 వేలు ఇవ్వవచ్చు కదా? అలాగే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీ కూడా అమలు చేయాలి' అని విజ్ఞప్తి చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... 'దావోస్ వెళ్లి పారిశ్రామికవేత్తలను కలిసి పరిశ్రమలు తెవడానికి కృషి చేస్తున్నట్లు చంద్రబాబు చెబుతున్నారు. అదే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే పరిశ్రమలు వాటంతట అవే వస్తాయన్న విషయాన్ని ఆయన గుర్తించాలి. ప్రత్యేక హోదాపై ఒత్తిడి చేయాలి' అని డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్, పుణ్యవతి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం రాష్ట్ర మహాసభల ప్రారంభం సందర్భంగా పతాకావిష్కరణ చేస్తున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఏ బేబి, బీవీ రాఘవులు, ఆ పార్టీ నేతలు వి.శ్రీనివాసరావు, గఫూర్, మధు, బాబూరావు

224 కిలోల గంజాయి పట్టివేత

- ఆనందపురం వద్ద లోడ్ చేసి కొల్హాపూర్‌కు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న సబ్బవరం పోలీసులు
- ఐదుగురు అరెస్టు
- వ్యాన్ స్వాధీనం


గంజాయితో పట్టుబడిన నిందితులను చూపుతున్న డీఎస్పీ, సిబ్బంది

సబ్బవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారిలోని మర్రిపాలెం టోల్ గేటు వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న 224 కిలోల గంజాయిని సబ్బవరం పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో ఐదుగుర్ని అరెస్టు చేయడంతో పాటు ఓ వ్యాన్, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ తెలిపిన వివరాలి. ఆనందపురం నుంచి అనకాపల్లి వైపు ఓ వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్నట్టు సీఐ రమణకు శనివారం ముందస్తు సమాచారం అందింది. ఈ మేరకు సాయంత్రం 4.30గంటలకు మర్రిపాలెం టోల్ గేటు వద్ద ఎస్ఐ పి.సింహాచలం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఇంతలో మహారాష్ట్ర రిజిస్ట్రేషన్‌తో ఉన్న వ్యాన్ రావడాన్ని గుర్తించారు. దానిని ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేయగా 108 ప్యాకెట్లలో 224 కిలోల గంజాయి పట్టుబడింది. వెంటనే వ్యాన్‌తో పాటు అందులో ఉన్న ఐదుగుర్ని స్టేషన్‌కు తరలించి, విచారించారు. గంజాయిని ఆనందపురం వద్ద లోడ్ చేసి మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు తరలిస్తున్నట్టు వారు వెల్లడించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.11.20 లక్షలు ఉంటుందని డీఎస్పీ చెప్పారు. అనంతరం అల్లూరి జిల్లా జి.మాడుగులకు చెందిన దూకరి రమణమూర్తి, దుర్గా బాలరాజు, మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు చెందిన అనిల్ సురేష్, రాహుల్ రాకేష్, సుమిత్ అమిత్ బాటింగేలను అరెస్టు చేశామన్నారు. వ్యాన్ డ్రైవర్‌ను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. గంజాయిని చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐ పి.సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

పెదనాయుడు చెరువు కాపాడుకుంటాం

- అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం
- విశాఖ- రాయపూర్ ఇంటర్ చేంజ్ రోడ్డు పనులను అడ్డుకున్న పలు గ్రామాల రైతులు

సబ్బవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : పెదనాయుడు చెరువును కాపాడుకుంటామని, అందుకు ఆమరణ నిరాహార దీక్ష చేయడానికైనా సిద్ధమని సబ్బవ రానికి చెందిన ఐదు గ్రామాల ఆయకట్టు రైతులు తేల్చిచెప్పారు. సబ్బవరం శివారు చిన్నయ్యపాలెం వద్ద విశాఖ- రాయపూర్ ఇంటర్ చేంజ్ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయా గ్రామాల రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గొర్లి అచ్చింనాయుడు, కొటాన అప్పారావు, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు తదితరులు మాట్లాడుతూ గురువారం పెదనాయుడు చెరువును పూడ్చివేసి ఇం టర్ చేంజ్ రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా అడ్డుకున్నామన్నారు. ఆ రోజు రైతులతో మాట్లాడిన తరువాతే పనులు చేపడతామని చెప్పిన ప్రాజెక్టు ఇంజనీర్ శుక్రవారం రాత్రి నుంచి దౌర్జన్యంగా పనులు చేపట్టడం దారుణమన్నారు. అర్ధ రాత్రి సమయంలో బండరాళ్లు


బండరాళ్లు వేసి చెరువును కప్పేస్తున్న దృశ్యం


చిన్నయ్యపాలెం వద్ద రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటున్న రైతులు

వేసి చెరువును కప్పేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారని, చూపించమంటే మాత్రం మిన్నకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో ఏదో మోసం ఉందని, అది తేలే వరకు పనులు చేస్తే ఊరుకునేది లేదని, ప్రాణాలకు తెగించైనా చెరువును కాపాడుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే ఆమరణ నిరాహారదీక్ష చేపడతామన్నారు. ఏం జరిగినా అందుకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని వారంతా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గొర్లి చైతన్య, గ్రామ పెద్దలు, రైతులు కిల్లి వెంకట సత్యనారాయణ, సబ్బవరపు బుజ్జి, నాగభూషణం, గొర్లి శ్రీను, ఎస్.శివ, నాగేంద్ర, పంచాడ కొండలరావు, గోపాలకృష్ణ, వెన్నల సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

శుకేశ్వరీ అలంకరణలో శ్యామా అమ్మవారు



సబ్బవరం, ఫిబ్రవరి 1 : మండలంలోని దేవీపురంలో రాజరాజేశ్వరీ సహస్ర అమ్మవారి పీఠంలో శ్యామా నవ రాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారు శనివారం శుకేశ్వరీ అలం కరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచి విశేష పూజలు జరిపారు. గురు పత్ని అన్నపూర్ణమ్మ, శ్రీవిద్యాట్రస్టు నిర్వాహకులు కం దర్ప రమా, ప్రభాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సద్గురు పాదు క్షేత్రంలో విశేష పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

పరవాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గౌతు లచ్చన్ననగర్‌లో షిర్డీసాయి సేవా ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ట్రస్ట్ చైర్మన్ వీవీ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భజనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సద్గురు పాదుక్షేత్రం దేశంలో ఎక్కడా లేదని ఇక్కడి సాయిమందిరం వద్దే ఏర్పాటు చేసినట్టు చైర్మన్ తెలిపారు.

వచ్చే నెల 3 నుంచి సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్ పరీక్షలు : డీఈవో

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి మూడో తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగనున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న పరీక్షల్లో భాగంగా అనకాపల్లి జిల్లాలో నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి రోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. మార్చి మూడో తేదీన 302 - ఇంగ్లీషు పరీక్ష, ఐదో తేదీన 301- హిందీ, 305- తెలుగు, 306- ఉర్దూ పరీక్షలు జరగనున్నాయన్నారు. ఏడో తేదీన 313- రసాయన శాస్త్రం, 318- ఆర్థిక శాస్త్రం, 331 - సామాజిక శాస్త్రం, పదో తేదీన 312- భౌతిక శాస్త్రం, 317- రాజనీతి శాస్త్రం/పౌర శాస్త్రం, 328- మనో విజ్ఞాన శాస్త్రం, 12వ తేదీన 311- గణితం, 315- చరిత్ర, 320- వ్యాపార గణక శాస్త్రం, 15వ తేదీన 314- జీవ శాస్త్రం, 319- వాణిజ్య/వ్యాపార శాస్త్రం, 321- గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పక్కా చేపడుతున్నామన్నారు.

పక్కాగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు

- రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో డీఆర్వో

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఈనెల 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరగనుందని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు తెలిపారు. ప్రస్తుతం కోడ్ అమలులోకి వచ్చినట్టు చెప్పారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమాలను ఖచ్చితంగా అమలు జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాల్సిందిగా కోరారు. ఇందు కోసం కమిటీలను నియమించినట్టు చెప్పారు. అనకాపల్లి డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జిల్లా నోడల్ అధికారిగా, రెవెన్యూ డివిజనల్ అధికారులను డివిజన్ స్థాయి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు అధికారులుగా నియమించారన్నారు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలో పర్యవేక్షణ అధికారులుగా ఉంటారన్నారు. గత ఏడాది డిసెంబరు 30న వెలువరించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 2802 మంది


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో సత్యనారాయణరావు

ఓటర్లు ఉన్నారన్నారు. అనకాపల్లి జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ఠ అమలుకు వివిధ స్థాయి అధికారులతో కూడిన 27ఎంసీసీ బృందాలను నియమించామని చెప్పారు. ఆర్డీవో షేక్ ఆయాషా, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ వాసు, టీడీపీ ప్రతినిధి బొలిశెట్టి శ్రీనివాసరావు, బీజేపీ ప్రతినిధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుళ్లాట నిర్వహిస్తున్న ఐదుగురు అరెస్టు


నిందితులతో సీఐ మల్లికార్జునరావు

పరవాడ, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయుడుపాలెం జంక్షన్‌లో గుళ్లాట నిర్వహిస్తున్న వారిపై శనివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడు బొంది కోటేశ్వరరావుతో పాటు మరో నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్దనుంచి నాలుగువేల రెండు వందల రూపాయల నగదుతో పాటు గుళ్లాటకు చెందిన డొక్కు, గుళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

సమస్యలపై క్వారీ, క్రషర్స్ కార్మికుల ఆందోళన



ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిని అందిస్తున్న నాయకులు

తుమ్మపాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ క్వారీ, క్రషర్స్ కార్మికులు శనివారం ఆందోళన చేపట్టారు. తొలుత గుండాల జంక్షన్ నుంచి ర్యాలీగా అనకాపల్లి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని అక్కడ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పండా గణేశ్ మాట్లాడుతూ క్వారీ, క్రషర్లలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ఇచ్చేదే అరకొర వేతనాలని వాటిని కూడా యాజమాన్యాలు నెలల తరబడి బకాయిలు పెడుతుండడంతో ఆయా కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. విధులు నిర్వహిస్తున్న వారికి రక్షణ చర్యలు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం దృష్టిసారించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్వారీ, క్రషర్ల కార్మిక సంఘం నాయకులు కోన మోహనరావు, జి.సూర్యారావు, ఎస్.సూరిబాబు, సీహెచ్.రమేష్, సీహెచ్‌చిన్నారావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నపాలెం ప్యాకేజింగ్ ఇండస్ట్రీలో యంత్రాల చోరీ



సాయి పేకేజింగ్ ఇండస్ట్రీ (అంతర్ చిత్రం) యంత్రాలు చోరీ జరిగిన ప్రదేశం

సబ్బవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యన్నపాలెంలో గల శ్రీసాయి పేకేజింగ్ ఇండస్ట్రీలో చోరీ జరిగింది. సుమారు రూ. ఐదు లక్షలు విలువ చేసే యంత్రాలను అపహరించుకుపోయినట్టు సంస్థ ఎండీ తుంపాల ఝాన్సీ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి యథావిధిగా పనులు ముగించి షట్టర్ వేసి ఇంటికి వెళ్లిపోయామని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉదయం వచ్చి చూసేసరికి షట్టర్లు తెరిచి ఉండడాన్ని గుర్తించి లోపలికి వెళ్లి చూడగా, పలు యంత్రాలు, ఇతర పని ముట్లు కనిపించలేదని వివరించారు. వెనుక వైపు వెళ్లిచూడగా, తలుపులు విరగ్గొట్టి ఉన్నాయని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీలో సబ్బవరం ఫస్టు


వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న ఎంపీడీవో

సబ్బవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పింఛన్ల పంపిణీలో జిల్లాలోనే సబ్బవరం మండలం మొదటి స్థానంలో నిలిచిందని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. శనివారం ఉదయం ఐదు గం టల నుంచే తమ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల నగదు అందజేసినట్టు చెప్పారు. మండలంలో 8107మంది సామాజిక పింఛన్ల లబ్ధిదారులు ఉండగా, 7898 మందికి అందజేశారన్నారు.

సమస్యలపై కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం

కశింకోట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల లెవెల్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారిణి వి.లక్ష్మీ సుభాషిణి హాజరై క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలపై ఇరువర్గాల వారిని పిలిచి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కాగా పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో అత్యధికంగా భూ తగాదాలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు కమిటీ వేసి సత్వర పరిష్కార మార్గం చూపుతామని వివరించారు. గత నెలలో పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు వెదురుపర్తి గ్రామానికి చెందిన ఓ భూ వివాద సమస్యపై ఫిర్యాదు వచ్చిందని దానిని త్వరలోనే పరిష్కరిస్తామని తెలియజేశారు. అధికారులంతా పర్యవేక్షించి ఆయా సమస్యకు పరిష్కారం చూపుతామని తెలిపారు. అలాగే ఉగ్గినపాలెంలో రీ సర్వేలో పేరు తప్పు పడిందని వాటిని


సమావేశంలో సమస్యలపై చర్చిస్తున్న అధికారులు

కూడా పరిష్కరిస్తామని తెలిపారు. జమాదులపాలెంలో భూ వివాదంపై కూడా క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎ.రవి కుమార్, మహిళా ఏఎస్ఐ కె.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెంలో దట్టంగా మంచు

లంకెలపాలెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నగర శివారు ప్రాంతమైన లంకెలపాలెం పరిసర గ్రామాల్లో శనివారం మన్యం వాతావరణం తలపించింది. తెల్లవారుజాము రెండు గంటల నుంచి దట్టంగా పొగ మంచు అల్లుకుంది. ఉదయం 8.30 గంటలైనా వీడలేదు. ఈ కారణంగా ప్రధాన రహదారులతో పాటు వీధి రోడ్లలో ఎదురుగా వచ్చే మనిషి సైతం కనిపించలేదు. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. ఉదయం విధులకు వెళ్లివచ్చేవారు, వాకింగ్‌తో పాటు వివిధ పనులపై బయటకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


లంకెలపాలెంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

ఉగ్గినపాలెంలో రాజకీయ నేతల ఫ్లెక్సీల తొలగింపు

కశింకోట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉగ్గినపాలెం తదితర గ్రామాల్లో ఉన్న రాజకీయ నేతల ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమాన్ని శనివారం అధికారులు చేపట్టారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. ప్రతి గ్రామంలో రాజకీయ నాయకుల విగ్రహాలను క్లాత్‌తో కప్పుతున్నారు. ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. ఎంపీడీవో రవికుమార్ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

జోలాపుట్టు జలాశయంలో పడవ బోల్తా

- ఇద్దరు బాలుర గల్లంతు
- పడవలో రీల్స్ చేస్తుండగా ప్రమాదం సంభవించినట్టు సమాచారం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ముంచంగిపుట్టు సమీపాన గల జోలాపుట్టు జలాశయంలో శనివారం సాయంత్రం పడవ మునిగి ఇద్దరు బాలురు గల్లంతయ్యారు. ప్రమాద సమయంలో పడవలో ముగ్గురు ఉండగా...ఒకరు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. పడవ ఎక్కి ఫొటోలు తీసుకుంటూ రీల్స్ చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా బిల్లాపుట్టు పంచాయతీ జోలాపుట్టు (ఆర్ఎఫ్ ఒడిశా)కు చెందిన వి.అమిత్ (15), కె.గౌతమ్ (15), వి.శివ (15) స్నేహితులు. వీరు జోలాపుట్టులో పదో తరగతి చదువుతున్నారు. శనివారం సాయంత్రం ముగ్గురూ జలాశయం వద్దకు వెళ్లి ఒడ్డున ఉన్న నాటు పడవపై లోపలకు వెళ్లి రీల్స్ చేయసాగారు. ఆ సమయంలో పడవ అదుపుతప్పి బోల్తాపడింది. గౌతం ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకుని, భయంతో పారిపోగా, అమిత్, శివ నీట మునిగిపోయారు. విషయం తెలుసుకున్న బాలుర కుటుంబ సభ్యులు, స్థానికులు సంఘటనా స్థలానికి పెద్ద సంఖ్యలో చేరుకొని రాత్రి ఎనిమిది గంటల వరకూ సెల్, టార్చ్ లైట్లతో జలాశయం పరిసరాల్లో వెతికినా ఫలితం కానరాలేదు.

ఎమ్మార్పీఎస్ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

తుమ్మపాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అమలుకు 'లక్షల డప్పులు.. వేల గొంతులు' నినాదంతో ఈనెల ఏడో తేదీన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను అంతా విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం అనకాపల్లిలో ఆ సమితి నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం తర్వాత హైదరాబాద్‌లో జరిగే మాదిగ, రెల్లి, ఉప కులాల భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి సిద్ధమయ్యేందుకు ఈ మహాసభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎలకా మల్లిబాబు, కొల్లి చినఅప్పారావు, కట్టమూరి మంగరాజు, కె.కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై టీడీపీ నాయకులు హర్షం

- అన్నిరంగాల అభివృద్ధికి సమ ప్రాధాన్యం : బత్తుల, బుద్ద


తాతయ్యబాబు, నాగజగదీశ్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మాలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర వార్షిక బడ్జెట్‌పై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజానీకంతో పాటు వేతన జీవులకు భారీగా ఊరటనిచ్చిందని ప్రశంసించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ బడ్జెట్‌లో కేటాయింపులను పరిశీలిస్తే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి జరగనుందన్నారు. ఉద్యోగులకు ఆదాయ పన్ను పరిమితి భారీగా పెంచి వారికి మేలు చేకూర్చినట్టు చెప్పారు. రైతులకు కిసాన్ కార్డుల పరిమితి పెంచడం ద్వారా రుణపరిమితి పెంచారన్నారు. రాష్ట్రానికి అధిక నిధులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రానున్న రోజుల్లో రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి జరగనుందని పేర్కొన్నారు. రోడ్లతో పాటు వంతెనలు నిర్మించే అవకాశం ఉందని వివరించారు. ఉద్యోగ, వ్యవసాయ రంగాలకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచండి

▸▸ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్




కె.సంతపాలెంలో క్యాబేజీ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్... గొండుపాలెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్

కె.కోటపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యాన పంటలను విస్తృతంగా పండించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. మండలంలోని గొండుపాలెం, కె.సంతపాలెం గ్రామాలను శనివారం సందర్శించారు. గొండుపాలెం గ్రామంలో పలువురికి పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం జిల్లాలోనే అత్యధిక కూరగాయలు పండించే కె.సంతపాలెంలో జిల్లా, మండలస్థాయి అధికారులతో కలిసి పొలం బాట పట్టారు. అక్కడ పండిస్తున్న వివిధ రకాల కూరగాయ పంటలను పరిశీలించారు. ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న క్యాలీఫ్లవర్ పంటను చూసి రైతులంతా ఒకే రకమైన పంటను కాకుండా రకరకాల కూరగాయలను పండిస్తే మంచి ఆదాయం పొందవచ్చునని కలెక్టర్ సూచించారు. సీజన్‌కు అనుగుణంగా మేలైన విత్తనాలు అందించి సేంద్రియ పద్ధతిలో సాగు చేసేటట్టు రైతులను ప్రోత్సహించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావును ఆదేశించారు. సేంద్రియ పద్ధతుల్లో పండించే కూరగాయలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. స్థానికంగా లభించే కూరగాయలే కాకుండా విదేశీ పంటలైన బ్రొకోలీ, జుకిని వంటి కూరగాయలను పండిస్తుండడంపై కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. పంట పండించే దగ్గర నుంచి మార్కెట్‌కు వెళ్లే వరకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని రైతులను ప్రశ్నించారు. వెజిటబుల్ క్లస్టర్లుగా గుర్తించిన గ్రామాల్లో ప్రతీ ఇంటికి రైతుబజారు కార్డులు అందించాలని, వీటివల్ల రైతులు నేరుగా మార్కెట్‌లో కూరగాయలు విక్రయించుకునే వెసులుబాటు లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వపరంగా రైతులకు అన్ని రకాల సదుపాయాలను కల్పించడం జరుగుతుందని బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శచిదేవి, మండల ప్రత్యేక అధికారిణి పూర్ణిమాదేవి, ఎంపీడీవో సాంబశివరావు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌బాబు, ఉద్యానవన శాఖాధికారి కిరణ్మయి, సర్పంచ్ చల్లా మంగ, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

రావికమతం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తకోట అంబేడ్కర్ కాలనీలో వేసవికి ముందే తాగునీటి ఎద్దడిపై మహిళలు నిరసన తెలిపారు. వైసిపి ప్రభుత్వం హయాంలో గత ఎనిమిది నెలల క్రితం జల జీవన్ పథకంలో ఈ కాలనీలో ఇంటింట కుళాయిలు నిర్మించారు. వీటి నిర్మాణంలో నాణ్యత లోపించడంతో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, దీంతో కుళాయిలు అలంకారప్రాయంగా మిగిలాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శనివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కుళాయిల నిర్మాణం సక్రమంగా లేకపోవడంతోనే తాగునీరు రావడం లేదని చిక్కాల రాజు, రెడ్డిమాల రాజు, ఎంకయ్యమ్మ, పూడి సత్యవతి తదితరులు అసహనం వ్యక్తం చేశారు. కొన్ని వీధులకు పుష్కలంగా నీరు సరఫరా అవుతున్నప్పటికీ, తమకు మాత్రం రావడం లేదని వాపోయారు. పాలకులు, అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో పంచాయతీ కార్యాలయం ఎదుటే ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు.

బెన్నవోలులో అగ్నిప్రమాదం

చోడవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెన్నవోలు గ్రామంలో శనివారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో గ్రామంలోని మజ్జి అప్పలనాయుడు ఇంట్లో సామగ్రి పూర్తిగా కాలిబూడిదయ్యాయి. టైలరింగ్ మిషన్‌తో పాటు ప్రింటర్, బీరువాలో బట్టలు కూడా కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలాడు. అలాగే ఇంట్లో కిరాణా దుకాణంలోని వస్తువులు కాలిపోయాయి. అప్పలనాయుడు కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ మూడెడ్ల శంకరరావు కోరారు.

చోరీ కేసులో మహిళ అరెస్టు

రావికమతం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధురాలిని మభ్యపెట్టి నగదు కాజేసిన కేసులో ఓ మహిళను కొత్తకోట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. దొండపూడి గ్రామానికి చెందిన వృద్ధురాలు గంపా సత్యవతి శుక్రవారం స్టేట్ బ్యాంకులో రూ.లక్ష నగదును డ్రా చేసి బ్యాగులో పెట్టుకుని నక్కపల్లి మండలం ఉద్దండపురంలోని బంధువులకు ఇచ్చేందుకు ఆటో ఎక్కింది. ఆ ఆటోలో అప్పటికే గుర్తు తెలియని మహిళ ఉంది. ఆటో రోలుగుంట మండలం నిండుగొండ గ్రామం దగ్గరకు వెళ్లాక అత్యవసరమని చెప్పి ఆటోను ఆపింది. అనంతరం వృద్ధురాలిని ఆటోలో నుంచి దింపేసి మహిళ, ఆటో డ్రైవర్ వెళ్లిపోయారు. దీంతో అనుమానం వచ్చిన వృద్ధురాలు బ్యాగును తెరిచి చూసుకోగా రూ.లక్ష నగదు కనిపించలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బ్యాగును బ్లేడుతో కోసి నగదును మహిళ దొంగిలించినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వి.మాడుగులకు చెందిన మహిళ ఈ చోరీ చేసినట్టు గుర్తించి శనివారం పట్టుకున్నారు. చోరీ సొత్తును రికవరీ చేసి వృద్ధురాలికి అందజేసినట్టు ఎస్ఐ తెలిపారు. మహిళను రిమాండ్‌కు పంపించామని చెప్పారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోటపాడు గ్రామానికి చెందిన గుమ్మాల మోహనరావు (48) ఫూటుగా మద్యం తాగడంతో ఇంటిలోనే మృతి చెందాడు. ఈ ఘటన శనివారం బయటపడింది. మూడు రోజులుగా మోహనరావు చుట్టుపక్కల వారికి కనిపించలేదు. ఇంటిలోనే ఉండి ఉంటారని భావించిన సమీపంలోని బంధువులు తలుపులు తీసి చూడగా మోహనరావు నిర్జీవంగా ఉన్నాడు. ఈ విషయాన్ని మాడుగుల ఎస్ఐ నారాయణరావుకు తెలియజేయడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మూడు రోజులుగా ఇంట్లోనే మోహనరావు ఉండిపోయి మద్యం ఎక్కువగా తాగడంతో మృతి చెందినట్టు చెబుతున్నారు. మోహనరావు భార్య వరలక్ష్మి హైదరాబాదులో కుమార్తె వద్దకు వెళ్లిందని, ఆమెకు సమాచారం ఇచ్చామని ఎస్ఐ చెప్పారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదని ఆయన తెలిపారు.

ఇద్దరు కానిస్టేబుళ్లపై దాడి చేసిన వీఆర్‌ఏపై చర్యలకు సిఫారసు

రోలుగుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిండుగొండలో గత నెల 26న గౌరీపరమేశ్వరుల తీర్థమహోత్సవంలో ఎక్సైజ్ పోలీసులపై దాడికి పాల్పడిన వీఆర్ఏ గుడాల శివపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నాగమ్మకు నర్సీపట్నం ఎక్సైజ్ అధికారులు లిఖితపూర్వకంగా తెలిపారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ రోజు రాత్రి ఎక్సైజ్ కానిస్టేబుళ్లు ఎల్.మాణిక్యరావు, జి.శ్రీనివాసరావు నిండుగొండలో విధులు నిర్వహిస్తుండగా అరటి చెట్టు మొదలులో సారాతో ఉన్న బాటిల్ కనబడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకుని ఇంటి యజమాని అయిన వీఆర్ఏ శివను ప్రశ్నించారు. ఈ క్రమంలో తన తమ్ముళ్లు అప్పలనాయుడు, వెంకట్‌లో కలిసి ఇద్దరు కానిస్టేబుళ్లపై తిరగబడి దుర్భాసలాడుతూ దాడి చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం గత నెల 27న ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తహసీల్దార్‌ను కోరారు. దీనిపై తహసీల్దార్‌ను విలేకరులు వివరణ కోరగా, ఈ విషయం వాస్తవమేనని, సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఆర్ఐ, వీఆర్వోకు ఆదేశాలు జారీ చేశామని ఆమె తెలిపారు.

ఎట్టకేలకు గాంధీ పార్కు పరిశుభ్రం



గాంధీ విగ్రహం వద్ద పరిశుభ్రం చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మాడుగుల గాంధీ పార్కులో ఎట్టకేలకు పారిశుధ్య పనులు చేపట్టారు. గాంధీ విగ్రహం వద్ద పారిశుధ్య నెలకొన్నప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. అలాగే గురువారం గాంధీజీ వర్ధంతిని కూడా జరపలేదు. ఈ నేపథ్యంలో 'మహాత్మా.. మన్నించు' అనే శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ప్రత్యేక కథనంతో అధికారుల్లో స్పందన వచ్చింది. పంచాయతీ ఈవో మూర్తిబాబు పార్కు లోపల, గాంధీజీ విగ్రహం వద్ద చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రం చేయించారు. ఎట్టకేలకు పార్కులో పారిశుధ్య పనులు చేపట్టడంపై పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి కె.రత్నకుమార్

చోడవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని, వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా అధికారులు కృషి చేయాలని స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి కె.రత్నకుమార్ చెప్పారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో జడ్జి మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న కేసుల పరిష్కారానికి కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.స్వప్న, అడిషనల్ సివిల్ జడ్జి బి.సూర్యకళ, సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.రమణమ్మ, సీఐ బి.అప్పలరాజు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కుసర్లపూడిలో ఏటికొప్పాక బొమ్మలు

రోలుగుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కుసర్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఏటికొప్పాక బొమ్మల ప్రదర్శనను నిర్వహించారు. ఏటికొప్పాక బొమ్మలతో తయారుచేసిన ఏపీ శకటానికి ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ప్రత్యేక స్థానం లభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు అప్పన రాంబాబు విద్యార్థులకు మరింత అవగాహన, జాతీయ భావం పెంపొందించడానికి ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

చీడికాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చీడికాడ గ్రామంలో శనివారం అభయాంజనేయస్వామి తీర్థం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, ఉదయం ముగ్గుల పోటీలు, మధ్యాహ్నం కోలాటాలు జరిగాయి. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ నాయకులు పోతల చిన్నంనాయుడు, జి.సత్యనారాయణరాజు, గండి ముసలినాయుడు, గండి లక్ష్మి, యర్రా అప్పారావు, జి.రవిరాజు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఆ పార్టీ నాయకులు పరవాడ మహేశ్, జి.రాజబాబు, పి.రామారావు స్వామివారిని దర్శించుకున్నారు.

పడవ బోల్తాపడి ఇద్దరు బాలుర గల్లంతు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ముంచంగిపుట్టు సమీపాన గల జోలాపుట్టు జలాశయంలో శనివారం పడవ మునిగి ఇద్దరు బాలురు గల్లంతయ్యారు. ఈ సమయంలో పడవలో ముగ్గురు ఉండగా...ఒకరు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. పడవ ఎక్కి ఫొటోలు తీసుకుంటూ రీల్స్ చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా బిల్లాపుట్టు పంచాయతీ జోలాపుట్టు (ఆర్ఎఫ్ ఒడిశా)కు చెందిన వి.అమిత్ (15), కె.గౌతమ్ (15), వి.శివ (15) స్నేహితులు. వీరు జోలాపుట్టులో పదో తరగతి చదువుతున్నారు. శనివారం సాయంత్రం ముగ్గురూ జలాశయం వద్దకు వెళ్లి ఒడ్డున ఉన్న నాటు పడవపై లోపలకు వెళ్లి రీల్స్ చేయసాగారు. ఆ సమయంలో పడవ అదుపుతప్పి బోల్తాపడింది. గౌతం ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకుని పారిపోగా, అమిత్, శివ నీట మునిగిపోయారు. విషయం తెలుసుకున్న బాలుర కుటుంబ సభ్యులు, స్థానికులు సంఘటనా స్థలానికి పెద్ద సంఖ్యలో చేరుకొని రాత్రి ఎనిమిది గంటల వరకూ సెల్, టార్చ్ లైట్లతో జలాశయం పరిసరాల్లో వెతికినా ఫలితం కానరాలేదు.

పింఛన్ లబ్ధిదారులతో దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు

▸▸ మండల ప్రత్యేకాధికారి నాగశిరీషా



కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఫోన్ ద్వారా పింఛనుదారుల సమస్యలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి

నాతవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పింఛన్ లబ్ధిదారులతో ఉద్యోగులు దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి నాగశిరీషా హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక భద్రత పింఛన్లకు సంబంధించి ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శనివారం సిబ్బందితో కలిసి ఫోన్ ద్వారా పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇంటికి వెళ్లకుండా పింఛన్లు పంపిణీ చేసే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం చమ్మచింత ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు పని వేళలు పాటించాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతంగా ఉండేటట్టు చూసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.జగన్నాథరావు, బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

పశుపక్ష్యాదుల పరిరక్షణకు ముందుకురండి

▸▸ పశుసంవర్ధక శాఖ ఏడీ చిట్టినాయుడు



సదస్సులో మాట్లాడుతున్న ఏడీ చిట్టినాయుడు

చీడికాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పశుపక్ష్యాదులను కాపాడేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు ముందుకురావాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) డాక్టర్ వి.చిట్టినాయుడు కోరారు. మండలంలో తురువోలు ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వేసవిలో పశుపక్ష్యాదులకు నీరు, తిండి లేక ఇబ్బందులు పడతాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు, తిండి గింజలు అందుబాటులో ఉంచితే వాటికి ఆహారంగా ఉంటుందన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి జంతువుల ఆరోగ్యం సంరక్షించాలని, రోడ్డు పక్కన పశువులకు ప్రమాదం జరిగితే వెంటనే పశు వైద్యులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్‌లు వేయించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడు జీపీఏ.నాయుడు, పెదగోగాడ పశు వైద్యాధికారి కేవీఎస్.రాఘవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు



గౌరీపరమేశ్వరుల నిమజ్జనంలో పాల్గొన్న భక్తజనం

గొలుగొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలలోని పాకలపాడు గ్రామంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. పాకలపాడు గ్రామంలో గౌరీపరమేశ్వరులను పుర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై పలు రకాల పిండి వంటలతో సారె సమర్పణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం గౌరీపరమేశ్వరుల ప్రతిమలను చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పలనాయుడు, నాయుడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మాకవరపాలెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలని అవంతి విద్యా సంస్థల అధినేత, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. అవంతి కాలేజీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సాంకేతిక సమావేశం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాలు ఉద్యోగానికి అవసరమైన సామర్థ్యాలను సూచిస్తాయని చెప్పారు. సమాచార నైపుణ్యం, సృజనాత్మకత, కిష్ట పరిస్థితుల్లో నిర్ణయం తీసుకోగలడం, పరస్పర సహకారం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు.ఎన్నుకోనే రంగం ఏదైనా గెలవాలనే తపనతో కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సదస్సులో 54 నమూనాలను ప్రదర్శించారు. వాటిలో 18 నమూనాలు ప్రత్యేకత సాధించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు, హిందుస్థాన్ జీఎం శ్రీనివాసరావు, కళాశాల జనరల్ సెక్రటరీ ప్రియాంక పాల్గొన్నారు.

గిరిజన సంఘాలు రాద్ధాంతం చేయడం తగదు



నిరసన తెలుపుతున్న రైతు సంక్షేమ సంఘం సభ్యులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలకు గిరిజన సంఘాలు రాద్ధాంతం చేయడం తగదని శ్రీరామ రైతు సంక్షేమ సంఘం ఫౌండర్ కేవీ.రమణ అన్నారు. ఈ మేరకు శనివారం పెదగంగవరంలో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నెల 27న విశాఖలో జరిగిన ప్రాంతీయ పెట్టుబడుల సదస్సులో 1-70 చట్టం సవరించాలని అయ్యన్న చేసిన ప్రకటనలో తప్పేముందని ప్రశ్నించారు. 1-70 చట్టం వల్ల విద్యార్థులకు సైతం ఆ భూములపై ఎటువంటి రుణాలు ఇవ్వలేదన్నారు. అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు పూర్తి మద్దతు తెలుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కొటాన రాము, అక్కునాయుడు, గవిరెడ్డి దేమునాయుడు, తోట దేముడు, మిడతాడ సింహాచలంనాయుడు, తోట దేముడు తదితరులు పాల్గొన్నారు.

పొగమంచు కమ్మేసింది..

మన్యం వాతావరణాన్ని తలపించేలా నర్సీపట్నంలో పొగమంచు దట్టంగా కురిసింది. శనివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు పొగమంచు కమ్మేసింది. నర్సీపట్నం-చింతపల్లి రోడ్డు, తుని, విశాఖపట్నం, చోడవరం, కోటవురట్ల రోడ్లలో దట్టంగా పొగమంచు కురవడంతో ఉదయం 8 గంటల వరకు హెడ్ లైట్ల వెలుతురులో వాహనాలు రాకపోకలు సాగించాయి.

-నర్సీపట్నం/ఆంధ్రజ్యోతి



రేపటిలోగా పింఛన్లు పూర్తిచేయండి

చీడికాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని సోమవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి కేవీఎస్.మూర్తి ఆదేశించారు. మండలంలో జైతవరం, జేబీపురం గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఎంపీడీవో హేమసుందర్రావుతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో ఆయన మాట్లాడుతూ తొలి రోజు 96 శాతం పింఛన్లు పంపిణీ పూర్తయ్యాయన్నారు. సోమవరంలోగా మిగిలిన పింఛన్లను పంపిణీ చేయాలని ఆదేశించారు.

472 గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

మాకవరపాలెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 472 గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించామని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టరు బి.రామ్మోహన్‌రావు తెలిపారు. శనివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఈ శిబిరాల ద్వారా 19,525 మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. అలాగే 21,516 పశువులకు డీవార్మింగ్ చేసినట్టు చెప్పారు. పశువుల్లో సంతానోత్పత్తి పెరగడానికి రైతులతో సమావేశాలు నిర్వహించి సూచనలు ఇచ్చామన్నారు. అలాగే పశుగణన సర్వే 90 శాతం పూర్తయిందని చెప్పారు.

'పాల ధరలో కోత అన్యాయం'

రోలుగుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పాల ధరలో కోత విధించి పాడి రైతులకు అన్యాయం చేశారని సీపీఎం నాయకుడు ఈరెల్లి చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని రత్నంపేట గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డెయిరీని కంపెనీ చట్టం నుంచి సహకార చట్టంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆవు పాల సేకరణపై పరిమితి ఎత్తివేయాలని, 50 శాతం రాయితీపై పశుదాణా ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బి.చిలుకు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

నర్సీపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. ఐదు రోడ్ల కూడలిలో శనివారం పర్యటించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతీ పంచాయతీలోను ఆదర్శ పాఠశాల ఏర్పాటు, హెల్త్ కార్డులకు బీమా కంపెనీలే చెల్లింపులు చేసేలా కృషి చేస్తామన్నారు. ఆయన వెంట పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ ఉన్నారు.

నేడు లక్ష్మీగణపతి హోమం

చోడవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో ఆదివారం లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు కె.చలపతి తెలిపారు. భక్తులు అధికంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.